క్లుప్తంగా

అనుపు పర్యాటక అభివృద్ధికి తోడ్పాటు అందించండి



విజయపురిసౌత్: మాచర్ల మండలంలోని ప్రసిద్ధి గాంచిన అనుపు బౌద్ధ పర్యాటక కేంద్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ కోరారు. బౌద్ధ పర్యాటక కేంద్రమైన అనుపుకు ప్రపంచ దేశాల నుంచి బూద్ధ మతస్తులతోపాటు పర్యాటకులు వస్తున్నారని అనుపులో సౌకర్యాలను మెరుగుపరచాలని ఆయన సీఎంకు విన్నవించారు. అనుపులోని పురాతన రంగనాథస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అలాగే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో అంతర్భాగమైన విజయపురిసౌత్ గ్రామాన్ని ఇటీవల పంచాయతీ ఏర్పాటుకు అధికారులను ఆదేశించిన నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల నాటికి ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని దారునాయక్ కోరారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

పిడుగురాళ్ల: సంక్రాంతి పండగను పురస్కరించుకొని పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటం జరిగిందని ఆర్టీసీ డిపో మేనేజర్ బి.కోటేశ్వరనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 తేదీ నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని, 10వ తేదీ నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సులు హైదరాబాద్ నుంచి గుంటూరుకు వయా పిడుగురాళ్ల మీదుగా నడుపుతున్నామన్నారు. 10, 11 తేదీలలో 4 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 12వ తేదీన 2 ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపబోతున్నామని తెలియజేశారు. ఈ అవకాశాన్ని పిడుగురాళ్ల పుర ప్రజలు సద్వినియోగం చేసువాల్సిందిగా డిపో మేనేజర్ తెలిపారు. అదేవిధంగా నూతనంగా నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చాయని, వాటిని స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రారంభిస్తామని అన్నారు.

ఎంఈవో కాంతారావుకు నివాళి



దాచేపల్లి : మండల శాఖ విద్యాశాఖ అధికారి కె.కాంతారావు సంతాప సభని సోమవారం నిర్వహించారు. దాచేపల్లి మండల విద్యా శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కాంతారావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో కాంతారావు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించి, కాంతారావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పినాకపాణి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగెండ్ల ఏసయ్య, తగరం ఆనంద్, మందా రాజశేఖర్, చెట్టిపొగు ఏసురత్నం, రాజారావు, సీఆర్పీలు అబ్రహం, వెంకటేష్, చంద్రమోహన్, జమాల్, వెంకటేష్, విజయ, ప్రైవేట్ పాఠశాలల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా క్రాంతి కుమార్



మాచర్ల : బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ఓర్సు క్రాంతికుమార్‌ను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారులు బి.మస్తాన్‌రావు, జె.బ్రహ్మయ్యలు సోమవారం తెలిపారు. మాచర్ల పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన క్రాంతి కుమార్ మాట్లాడుతూ పట్టణంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన బీజేపీ నాయకులు పి.కాశీపతి, మస్తాన్‌రావు, వంశీకృష్ణ, ఎ.సురేష్‌కుమార్, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ముగ్గుల పోటీలు

మాచర్ల రూరల్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ నెల 7న మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు మండల పరిధిలోని అలుగురాజుపల్లి వద్ద న్యూటన్స్ ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్స్‌లో భారీ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. వివరాలకు 9494470813, 9494470817, 9492142983 లను సంప్రదించాలన్నారు.

నీటి సంఘాలు అందుబాటులో ఉండాలి

పిడుగురాళ్ల: రైతులకు నీటి సంఘాలు అందుబాటులో ఉండి ప్రతి చివరి భూమికి సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. సోమవారం పట్టణంలో ఇరిగేషన్ కార్యాలయంలో నీటి సంఘాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సాగర్ కెనాల్ ద్వారా వచ్చే సాగునీరు ఎక్కడా వృధా కాకుండా సాగు నీటికి ఉపయోగపడేలా కాలువలను ఆధునీకరించి నీటిని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందేనా..?!

- నిధులున్నా.. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- మధ్యలోనే నిర్మాణం ఆగిపోయిన పట్టణ ఆరోగ్య కేంద్రం
- వైద్యం కోసం ఎదురు చూస్తున్న పేదలు
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మాణం ఆగిపోయిన పట్టణ ఆరోగ్య కేంద్రం



లెనిన్ నగర్‌లో వైద్య సేవలు అందిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రం

పిడుగురాళ్ల: పట్టణ పేద ప్రజల కోసం పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిడుగురాళ్ల పట్టణంలో మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేశారు. అందులో రెండు ఆరోగ్య కేంద్రాలు పూర్తయి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

- జానపాడు రోడ్డులోని ప్లీడబ్ల్యూడీ కాలనీలో రూ.80 లక్షలతో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి చేశారు. అలాగే పట్టణంలోని లెనిన్ నగర్‌లో మరో రూ.80 లక్షలతో పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తి చేసి అప్పటి గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. పేద ప్రజలకు, కార్మికులకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. అలాగే పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మూడవ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రూ.80 లక్షల నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2024 ఎన్నికలు రావటంతో ఈ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది.

కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 8 నెలలు గడుస్తున్నప్పటికీ నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో నిరుపయోగంగా తయారయింది. పేద ప్రజలకు ఉపయోగపడే పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి చేస్తే ఆ ప్రాంతంలోని పేదలు, బడుగు బలహీన వర్గాలు, కార్మికులు వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. అయితే మార్కెట్ యార్డులో రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ దూరంగా ఉండటంతో ప్రజల రాకపోకలకు, ఆటో చార్జీలు భారమై పేదలు, రోజు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. అదే ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్మాణ పనులు ఆగిపోయిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి చేస్తే ప్రజలకు ఉచితంగా మంచి వైద్య అందుతాయని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు.

ఇప్పటికీ నిధులు ఉన్నాయి

పట్టణంలోని అర్ధంతరంగా ఆగిపోయిన పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ఇప్పటికీ నిధులు మంజూరై ఉన్నాయి. మొత్తం రూ.80 లక్షలు నిర్మాణానికి మంజూరై ఉన్నాయి. వాటిల్లో నిర్మాణానికి కొన్ని నిధులు మాత్రమే ఖర్చు అయ్యాయి. మొత్తం మీద మిగిలి ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు నిధులు సంసిద్ధంగానే ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టి తక్షణమే గుత్తేదారులకు పనులు కేటాయిస్తే పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు చేపట్టి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరగా నిర్మించండి



హాస్పిటల్ త్వరగా నిర్మిస్తే మాలాంటి రోజు కూలీలు ఉచితంగా వైద్యం పొందేందుకు వీలు ఉంటుంది. అధికారులు దీనిని గమనించి పేద ప్రజల కోసం త్వరగా ఈ హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేసి వైద్య సేవలు అందించి పేద ప్రజలను ఆరోగ్యం అందుబాటులో ఉండేలా చూడాలి.

– షేక్ మౌలాలి, పిడుగురాళ్ల

ఆర్థిక భారం మోయలేం



ఏ చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తిన ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లి వైద్య సేవలు పొందేందుకు ఆర్థిక భారం మోయలేకపోతున్నాం. అందుకే ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని త్వరగా నిర్మించి పేద ప్రజలకు ఆరోగ్యం అందేలా చేస్తే మాలాంటి కూలీలు ఇబ్బందుల నుంచి బయట పడే అవకాశం ఉంటుంది.

– వేముల గురవమ్మ, పిడుగురాళ్ల

నెలలో పనులు మొదలయ్యేలా చూస్తాం

ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రం గత ప్రభుత్వంలో నిర్మాణం నిదానంగా జరిగింది. నిర్మాణానికి సరిపడా నిధులు సిద్ధంగా ఉన్నాయి. ఒక నెల లోపు నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రారంభించి పూర్తి అయ్యేందుకు కృషి చేస్తాం.

– రాఘవేంద్ర, మున్సిపల్ ఏఈ, పిడుగురాళ్ల

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పెండింగ్ ఆర్‌డీఎస్ఎస్ పనులు, 33 కేవీ పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ కె.విజయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన పిడుగురాళ్లలో జరగనున్న సీజీఆర్ఎఫ్ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై పలు సూచనలు అందించారు. రాజుపాలెం మండల పరిధిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించాలని, పీఎం సూర్య ఘర్‌పై ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. రాబోయే వేసవి కాలం లోపు 33, 11 కేవీ లైన్‌ల మరమ్మతులు చేయాలని సూచించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఈఈ బి.నాగసురేష్‌బాబు, డిప్యూటీ ఈఈ సుందరబాబు, సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌లో 4 అర్జీలు

మాచర్ల రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 4 అర్జీలు అందినట్లు తహసీల్దార్ బత్తుల వాణి తెలిపారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వాకింగ్ ట్రాక్ కోసం కేటాయించిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని బీఎస్పీ నాయకులు గుండాల సైదులు యాదవ్, పాలెం 22ఏ జాబితా నుంచి తొలగించాలని మధుసూదనరెడ్డి, జయ సింహారెడ్డిలు, పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూమికి సర్వే నిర్వహించి అడంగల్‌లో నమోదు చేయాలని వెంకటేష్ వినతి పత్రాలు అందించినట్లు ఆమె తెలిపారు. ఆర్ఐ అనిల్‌కుమార్, ఎస్ఏ రంగారావు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో నవీనా విద్యార్థుల ప్రతిభ



పిడుగురాళ్ల: ఈ నెల 5వ తేదీన పల్నాడు జిల్లా స్థాయిలో నరసరావుపేట సెయింట్ మేరీస్ సీబీఎస్ఈ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీ పరీక్షలలో పట్టణానికి చెందిన నవీనా టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. అబాకస్ సీనియర్ లెవల్ 5లో 5వ తరగతికి చెందిన కె.భవ్యశ్రీ జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. అబాకస్ జూనియర్ లెవల్ 1లో రాయల్ శ్రీనివాస్ జిల్లా ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే వేదిక్ మ్యాథ్స్ లెవల్ 3లో 7వ తరగతికి చెందిన కె.ప్రణీత జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా వేదిక్ మ్యాథ్స్ లెవల్ 5లో 9వ తరగతికి చెందిన ఆతుకూరి అగస్త్య జిల్లా ప్రథమ స్థానం పొందింది. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌లు టి.బాలగంగాధర్‌రెడ్డి, టి.వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ టి.రజిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

■ నిబంధనలు పాటించాలి

గురజాల రూరల్: వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలని సీఐ ఆవుల భాస్కర్ అన్నారు. స్థానిక పులిపాడు అడ్డరోడ్డులో సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనం నడుపు సమయంలో ఎవరూ మద్య పానం తాగరాదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో అధిక శాతం మద్యం తాగిన వారివేనన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. వాహనం నడుపుతున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

■ పైప్‌లైన్ ఏర్పాటు పనుల పరిశీలన

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు ప్రాంతాలలో ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి నూతనంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి తెలిపారు. సోమవారం ఆమె ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్‌తో కలిసి స్థానిక ఆర్‌సీఎం స్కూల్ వెనుక నున్న గురజాల డొంక రహదారిలో ఏర్పాటు చేస్తున్న పైప్ లైన్ పనులను పరిశీలించి మాట్లాడారు. రూ.6 లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్న 300 మీటర్ల పైప్‌లైన్ ద్వారా గ్రామంలో స్థానిక చపారపువారి వీధి, వడ్డెర బావి సెంటర్, ఉట్లస్తంభాల సెంటర్ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఆమె వెంట మాజీ వైస్ ఎంపీపీ సుమంత్‌రెడ్డి, మాజీ పీహెచ్‌సీ చైర్మన్ రామకృష్ణ, ఇన్నారెడ్డి, అప్పయ్య, చిన్న శౌరెడ్డి, రాయపురెడ్డి తదితరులున్నారు.

■ ఎస్సీ కుల గణనపై విచారణ చేపట్టాలి

దుర్గి: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ జనాభా వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాలలో ఏర్పాటు చేసిన ఎస్సీ కుల గణన వివరాలపై పలు అభ్యంతరాలు ఉన్నాయని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నిర్మలకు వినతి పత్రం అందజేసి, మాట్లాడుతూ అధికారులు ఎస్సీ కుల గణనపై వెంటనే విచారణ చేపట్టాలన్నారు. లేని పక్షంలో తప్పుల తడకలాగా నమోదయ్యే అవకాశముందన్నారు. వెంటనే సంబంధిత తహసీల్దార్ జోక్యం చేసుకోవాలన్నారు.

■ విద్య ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యం

మాచర్ల రూరల్: విద్య ద్వారానే ఆర్థిక అసమానతలు తొలగి కుటుంబం ముందుకు పోతుందని, తప్పనిసరిగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ చిన్నారులను బడిబాట పట్టించాలని హెచ్ఎం కె.కృష్ణారావు కోరారు. సోమవారం మండలంలోని లింగాపురం గ్రామ ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లతో ఉన్నత విద్యతో పాటు ఉచితంగా మధ్యాహ్న భోజనం, యూనిఫాం, బూట్లు వంటివి అందిస్తున్న విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

■ ముమ్మరంగా సామాజిక తనిఖీలు

దాచేపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎస్సార్పీ రాజు ఆధ్వర్యంలో 7 బృందాలు 14 గ్రామ పంచాయతీల్లో తనిఖీలు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం తక్కెళ్లపాడు గ్రామంలో తనిఖీ చేశారు. 2023-24 సంవత్సరంలో చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నారు. అనుమానం ఉన్న చోట్ల కొలతలు తీస్తున్నారు. పనుల నాణ్యతను కూడా పరిశీలిస్తున్నారు. ఈ నెల 10న సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీడీ మల్లికార్జునరావు చెప్పారు.

■ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మాచర్ల : మాచర్ల పట్టణంలోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా మాచర్ల బస్టాండ్‌లోని వెంకటేశ్వరస్వామి గుడి వద్ద అనాథలు, వృద్ధులకు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. శిబిరంలో డాక్టర్ చల్లా వెంకటేశ్వర్లు వైద్య పరీక్షలు చేశారు. మెట్టు గోవింద రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్న అందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. డాక్టర్ చల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు గోవిందరెడ్డి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలకు తమ వంతు ఉచితంగా ప్రజలకు వైద్య సేవలు అందజేస్తామన్నారు. సాయి శ్రీనివాస్ హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

■ బుడగ జంగాల వినతి పత్రం

కారెంపూడి: బేడ బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ బేడ బుడగ జంగాల ప్రతినిధులు సోమవారం సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందించారు. చాలా కాలంగా సంచార జాతిగా జీవనం సాగిస్తున్న తమను ఎస్సీల జాబితాలో చేర్చాలని కోరుతున్నామని ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కొప్పెర శ్రీను, రామస్వామి, అంజయ్య, వెంకటేష్, తిరుపతయ్య వినతి పత్రం సమర్పించారు.

■ ఆసక్తి గల కార్మికులు నమోదు చేసుకోవాలి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పురపాలక సంఘ పరిధిలో నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ ఎకోసిస్టమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో ఆసక్తి గల ట్యాంక్ క్లీనర్స్, కార్మికులు ఈ నెల 9వ తేదీ లోపు పురపాలక సంఘ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వారికి పీపీఈ కిట్స్, పీఎంజేఏవై కింద ఆరోగ్య బీమా కల్పించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

■ అభ్యంతరాలు తెలపండి

గురజాల/మాచర్ల/పిడుగురాళ్ల/దాచేపల్లి: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో విద్యుత్ రేట్ల నిర్ణయంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలని మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతలపాటి సింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ రేట్లపై ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి 10వ తేదీన కర్నూలు నుంచి విచారణ చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ రేట్లపై ఎవరికైనా అభ్యంతరాలను తెలిపేందుకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు మాచర్లలోని ఈఈ కార్యాలయంలో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరు కావాలన్నారు.

మిరప తోటల పరిశీలన



మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం, మాచవరం, ఆకురాజుపల్లి గ్రామాల్లో ఉన్న మిరప తోటలను ఉద్యాన అధికారి వై.మోహన్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిరపలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. మిరపలో తామర పురుగు నివారణ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని, అధికారులను సంప్రదిస్తే వెంటనే తామరపురుగు నివారణ మార్గాలను తెలియజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో జీవించాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రెంటచింతల: నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులందరూ సుఖ సంతోషాలతో జీవించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం టీఎన్‌యూఎస్ ఉపాధ్యాయ సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే జూలకంటి ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం నాయకులు నూతనోత్సాహంతో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మక్కపాటి రాంబాబు, సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల పరిశీలన



రెంటచింతల: మండలంలో మాచర్ల-దాచేపల్లి బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్-167 ఏడీ) నిర్మాణానికి ఇచ్చిన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 376లో నున్న 1.76 ఎకరాల భూమిని సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్, ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ గాదె రామిరెడ్డి మాట్లాడుతూ జాతీయ రహదారి 167 ఏడీ వలన భూమిని కోల్పోయిన రైతులకు గతంలోనే నష్టపరిహారం చెల్లించారని మా ఆలయానికి చెందిన 1.76 ఎకరాల భూమికి రూ.30 లక్షలు నష్టపరిహారం ఇప్పటికీ చెల్లించలేదని వివరించారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి నష్టపరిహారం అందజేయడానికి కృషి చేస్తానని సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. వారి వెంట జాతీయ రహదారి గుత్తేదారు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావించేందుకు ఈ నెల 8న సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్‌లు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ప్రకృతి పంటలు ఆరోగ్యానికి మేలు



ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులప్రదర్శన



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌లో తహసీల్దార్

దాచేపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు, ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని మండల వ్యవసాయశాఖ అధికారిణి దొండేటి పాపకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రదర్శించారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో పాటు స్థానికులు వచ్చి ఆహార ఉత్పత్తులను పరిశీలన చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, రసాయనాలు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆహార ఉత్పత్తులు ఎక్కువగా వినియోగించాలని ఏఓ పాపకుమారి చెప్పారు. ఎంపీపీ కందుల జాను, వెలుగు ఏపీఎం రవికుమార్, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి కొత్తపల్లి రమేష్, సిబ్బంది చిరంజీవి, జ్యోతి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయండి

పిడుగురాళ్ల: ప్రతి ఒక్కరు వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు తింటే ఆరోగ్యంగా ఉంటారని స్థానిక తహసీల్దార్ మధుబాబు సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ విభాగం పిడుగురాళ్ల మండలం గుత్తికొండ డివిజన్ యూనిట్ ఉత్పత్తుల కేంద్రం పండించిన ఆర్గానిక్ కూరగాయలు, ఆకుకూరల స్టాల్‌ను తహసీల్దార్ మధుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడిన స్టాల్‌లో కూరగాయలు ఎంతో ఆరోగ్యకరమన్నారు. ఆర్గానిక్ పంటల ఉత్పత్తులను వారానికి రెండు రోజులు ప్రభుత్వ కార్యాలయాల్లో అమ్మకానికి ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ శర్మ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, సాధికార సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లవరంలో పారిశుద్ధ్య పనులు



మల్లవరంలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

రెంటచింతల: గ్రామంలో పారని డ్రెయిన్లు, తీయని చెత్త కుప్పలు వెరసి అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితిపై మండలంలోని మల్లవరం గ్రామస్తులు పడుతున్న వెతలపై 'అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం గ్రామంలో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ మేరకు ఈఓపీఆర్డీ చిలుకూరి శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలునాయక్‌లు గ్రామాన్ని సందర్శించి అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారుల అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. సైడు కాల్వలలోని మురుగు పూడికలను తొలిగింపు చర్యలను చేపట్టి బ్లీచింగ్ చల్లించారు. ఎంతో కాలంగా మురుగు పూడికలు తీయించకపోవడంతో దోమలుతో అల్లాడిన గ్రామస్తులు దీంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అంగన్‌వాడీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణ చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నో పోరాటల ఫలితమే అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారమని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ సహాయకుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొని అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ స్థాయికి ఎదిగారన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా వేతనాలు, హక్కులను సాధించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని వెంటనే అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు, సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకులు శాంతమణి, షేక్ హజరా, శివరంజని, బి.నాగమణి, జ్యోతి, పద్మ, నాగమణి, విజయలక్ష్మీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దుర్గి: మండల పరిధిలోని కంచరగుంట గ్రామానికి చెందిన బీర్నీడి వెంకయ్య (47) రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మాచర్ల నుంచి దుర్గికి బైకుపై వస్తున్న క్రమంలో స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనటంతో వెంకయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాథమిక చికిత్స నిమిత్తం దుర్గి ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలించినట్లు బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.